



APTEL/25/A5250

మన రాజధాని

# రక్షణ

నిజం మా బలం


ఎడిటర్ : నరేంద్ర

గుంటూరు | సంపుటి : 1 | సంచిక : 98 | పేజీలు : 4 | శనివారం 11 ఏప్రిల్ 2026 | వెల : 4/-

## ఎన్నికల వేళ మోదీ గిమ్మిక్కులు

- నియోజకవర్గాల పునర్విభజనతో పెను ముప్పు: ఖర్గే
- మహిళా రిజర్వేషన్ల అమలులో కుట్ర
- నియోజక వర్గాల పునర్విభజనపై విపక్షాల ఉమ్మడి పోరుకు ఖర్గే పిలుపు





## క్యాబినెట్ లీకులపై మంత్రులకు
# సీఎం క్లాస్

- క్యాబినెట్ విషయాలు బయటకు రావడంపై సీఎం ఆగ్రహం
- ఎన్టీఆర్ ఉదాహరణతో మంత్రులకు హెచ్చరిక
- మున్సిపల్ ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని సూచన
- క్యాబినెట్ నిర్ణయాలపై గోప్యత పాటించాలని ఆదేశం

అమరావతి: క్యాబినెట్ సమావేశాల్లో చర్చించే అంశాలు ముందుగానే బయటకు రావడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రులకు తీవ్ర హెచ్చరికలు చేశారు. క్యాబినెట్ వ్యవహారాల్లో గోప్యత తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. గతంలో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో క్యాబినెట్ విషయాలు లీక్ కావడంతో 30 మంది మంత్రులను తొలగించిన ఘటనను ఉదాహరణగా పేర్కొన్నారు.

3

## రాయలసీమ ప్రాజెక్ట్‌పై వైసీపీ రాజకీయాలు

రాయలసీమపై ప్రేమ పేరుతో రాజకీయాలు చేస్తున్నారని విమర్శ
ఎన్జీటీ ఆదేశాలతో ప్రాజెక్ట్ మీ హయాంలోనే ఆగిందని వ్యాఖ్య
రూ.40 వేల కోట్లతో రాయలసీమ హార్టీకల్చర్ హబ్ ఏర్పాటు
తుంగభద్ర డ్యాం గేట్లు వర్షాల ముందు పూర్తిచేస్తామని హామీ



రాయలసీమ ప్రాజెక్ట్‌ను రాజకీయంగా వాడుకోవాలని వైసీపీ ప్రయత్నించడం హేయమని ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నుల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో రాయలసీమ అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. ఎన్జీటీ ఆదేశాలతో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ వైసీపీ ప్రభుత్వ కాలంలోనే ఆగిపోయిందని పేర్కొన్నారు.

3

## సీఎంతో బీసీ సంఘాల భేటీ

ప్రత్యేక బీసీ కమిషన్ ఏర్పాటుకు విజ్ఞప్తి
బీసీల రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్
స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ల అమలుపై సూచనలు
కేంద్రంతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని సీఎం హామీ



అమరావతి: బీసీల సంక్షేమం, అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. బీసీ సంఘాల ప్రతినిధులు సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రిని కలిసి పలు కీలక డిమాండ్లతో కూడిన విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. జనాభా దామాషా ప్రాతిపదికన రిజర్వేషన్లు, బీసీల రక్షణ చట్టం, ప్రత్యేక బీసీ కమిషన్ ఏర్పాటు వంటి అంశాలను కేంద్రంతో చర్చించాలని కోరారు. బీసీలకు పూర్తి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు.

## స్థానిక ఎన్నికలకు
# సిద్ధం కావాలి



- మంత్రులతో కీలక సమావేశం నిర్వహించిన లోకేశ్
- పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి
- ప్రజల సమస్యలపై చురుకుగా పనిచేయాలని సూచన
- రాబోయే ఎన్నికలపై ముందస్తు వ్యూహం

రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ నాయకులు, మంత్రులు సిద్ధంగా ఉండాలని మంత్రి నారా లోకేశ్ సూచించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలు ప్రజలకు స్పష్టంగా కనిపించేలా పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో పార్టీ వ్యవస్థను బలోపేతం చేసి ప్రతి స్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

3



## పీఎన్జీ వినియోగం
# పెంచాలి

- దీపం లబ్దిదారులకు పీఎన్జీపై అవగాహన కల్పించాలి
- 6 నెలల్లో 10 లక్షల పీఎన్జీ కనెక్షన్ల లక్ష్యం
- గ్యాస్ సరఫరా సమస్యలపై సీఎం సమీక్ష
- శ్రీకాకుళం-కాకినాడ పైప్‌లైన్‌పై కేంద్ర మంత్రికి ఫోన్

రాష్ట్రంలో పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) వినియోగాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. దీపం పథకం లబ్దిదారులకు పీఎన్జీ వినియోగంపై అవగాహన కల్పించాలని, వచ్చే ఆరు నెలల్లో 10 లక్షల పీఎన్జీ కనెక్షన్లు ఇవ్వాలని ఆయిల్ కంపెనీలకు లక్ష్యాన్ని నిర్దేశించారు. గ్యాస్ సరఫరా పరిస్థితిపై సీఎం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు.

3

## న్యాయశాఖ పటిష్టతకు చర్యలు

పబ్లిక్ లిటిగేషన్ పాలసీపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశం
అనవసర కేసులు తగ్గించడంపై చర్చ
లోక్ అదాలత్‌ల బలోపేతానికి చర్యలు
ఇతర రాష్ట్రాల విధానాల పరిశీలన



**అమరావతి, రక్షణ న్యూస్**

రాష్ట్రంలో న్యాయశాఖను మరింత పటిష్టం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ లిటిగేషన్ పాలసీపై మంత్రివర్గ ఉపసంఘం శుక్రవారం సమావేశమై పలు అంశాలపై విస్తృతంగా చర్చించింది. రాష్ట్రంలో న్యాయశాఖ బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి . ఎం . డి . ఫరూక్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ లిటిగేషన్ పాలసీని పరిశీలించేందుకు ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం శుక్రవారం వెలగపూడి సచివాలయంలో సమావేశమైంది. ఈ సమావేశంలో న్యాయశాఖ మంత్రి ఫరూక్‌తో పాటు హోం శాఖ మంత్రి వంగళపూడి అనిత , వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై . సత్య కుమార్ ఖుఖుజ పాల్గొన్నారు. న్యాయశాఖ ఉన్నతాధికారులతో కలిసి పబ్లిక్ లిటిగేషన్ పాలసీ అమలుపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలో అనవసరమైన వ్యాజ్యాలను తగ్గించడం, కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయడం, పాలనలో పారదర్శకత మరియు జవాబుదారీతనాన్ని పెంచడం లక్ష్యంగా ఈ మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినట్లు మంత్రి ఫరూక్ తెలిపారు. కేసుల నిర్వహణలో ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా అనవసర అప్పీళ్లను తగ్గించేందుకు చర్యలు - మిగతా2లో

# ఎన్నికల వేళ మోదీ గిమ్మిక్కులు

మహిళా రిజర్వేషన్ల అమలు విషయంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శుక్రవారం తీవ్రంగా ఖండించారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలు చేసేందుకు మోదీ సర్కార్ ప్రతిపాదించిన నియోజక వర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియ తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని పేర్కొన్నారు. అంశంపై విపక్ష పార్టీలన్నింటితో కలిసి ఒక ఉమ్మడి వ్యూహాన్ని రూపొందిస్తామని, అందరం కలిసి ఐక్యంగా ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు. కేవలం రాజకీయ ప్రయోజనం కోసమే మోదీ ప్రభుత్వం ఏప్రిల్? 16 నుంచి ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహిస్తోందని ఖర్గే ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లును అత్యంత వేగంగా ఆమోదించేందుకు మోదీ సర్కార్ ఆసక్తి చూపుతోందని, ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ)ని పూర్తిగా ఉల్లంఘించడమేనని ఆయన అన్నారు. ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు, ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణలు దేశ ఎన్నికల వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూసే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం 'ఇందిరా భవన్'లో మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, సచిన్ పైలట్?, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డి తదితరులు



పాల్గొన్నారు. ఈ విధంగా పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు ముందు కాంగ్రెస్ సీడబ్ల్యూసీ జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది.

**అంత హడావుడి ఎందుకు?**

మోదీ సర్కార్ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో కీలక బిల్లులను ప్రవేశపెట్టడానికి సిద్ధమవుతోంది. అందులో 2029 పార్లమెంట్ ఎన్నికలకు ముందే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయడంతోపాటు, లోకసభ స్థానాల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 543 నుంచి 816కు పెంచి, అందులో 273 స్థానాలను మహిళలకు కేటాయించేలా బిల్లులు పెట్టనున్నారు. కాగా, 2029 ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్లు అమలు చేసేందుకు, లోక్‌సభ స్థానాలకు పెంచేందుకు సంబంధించిన ముసాయిదా బిల్లులకు కేంద్ర మంత్రివర్గం బుధవారమే ఆమోదం తెలిపినట్లు సమాచారం. అయితే ఇదంతా ప్రధాని నరేంద్ర మోదీ ప్రస్తుత తమిళనాడు, బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందడం కోసమే చేస్తున్నారని కాంగ్రెస్ సహా విపక్షాలు అన్నీ విమర్శిస్తున్నాయి.

**ప్రమాదకర పరిణామాలకు దారితీయెచ్చు!**

కాగా, ప్రభుత్వం హడావుడిగా చేపడుతున్న డీలిమిటేషన్ ప్రక్రియ ప్రమాదకరమైన పరిణామాలకు దారితీస్తుందని కాంగ్రెస్ కమ్యునికేషన్ ఇన్?ఛార్జ్? జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్ హెచ్చరించారు. ప్రస్తుతమున్న నియోజకవర్గాల సంఖ్య విషయంలో తాము ఎలాంటి అస్థిరత కలగకూడదని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజక వర్గాల పునర్విభజన విషయంలో రాజ్యాంగాన్ని సవరించడానికి ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని కాంగ్రెస్ కేంద్రాన్ని హెచ్చరించింది. ఇది చాలా సున్నితమైన అంశమని, ఈ ప్రక్రియ వల్ల తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉన్నందున ప్రభుత్వం జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించింది. వీటితోపాటు పశ్చిమాసియా ఉద్రిక్తతలు గురించి, అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందం గురించి కూడా సీడబ్ల్యూసీలో కాంగ్రెస్ సమీక్షించింది. ఈ విషయంలో మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై మండిపడింది. కాల్పుల విరమణ విషయంలో పాకిస్థాన్ కీలక పాత్ర పోషించిందని, తద్వారా విదేశాంగ విధానంలో మన దేశం వెనుకబడేలా మోదీ సర్కార్ చేసిందని దుయ్యబట్టింది. కాల్పుల విరమణ చర్చల విషయంలో ప్రధాని మోదీ ఎక్కడా ఎందుకు కనిపించలేదని ప్రశ్నించింది.

# పాకిస్థాన్ గూఢచార మాడ్యూల్ గుట్టురట్టు చేసిన ఢిల్లీ పోలీసులు

భారీ టెర్రర్ మాడ్యూల్‌ను ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్ శుక్రవారం ఛేదించింది. పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తున్న 11 మందిని అధికారులు అరెస్టు చేశారు. పాకిస్థాన్‌కు చెందిన ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్(ఐఎస్ఐ) కనుసన్నల్లో ఈ ముఠా పని చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ముఠా ప్రధానంగా గూఢచర్యం, ఆయుధాల అక్రమ రవాణా, సైనిక స్థావరాలపై రహస్య పరిశీలన వంటి కార్యకలాపాల్లో నిమగ్నమై ఉందని అధికారులు తెలిపారు. ఈ ముఠా సైనిక స్థావరాల కదలికలను కనిపెట్టడానికి సోలార్ పవర్‌తో నడిచే సీసీటీవీ కెమెరాలను రహస్యంగా ఏర్పాటు చేసినట్లు గుర్తించిన అధికారులు విస్తుపోయారు. పంజాబ్, హరియాణ, జమ్ముకశ్మీర్, రాజస్థాన్ రాష్ట్రాల్లోని సున్నిత ప్రాంతాల వద్ద సౌరశక్తితో పనిచేసే సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తెలిసింది. ఇప్పటివరకు దాదాపు 9 కెమెరాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు అధికారులు. ఈ కెమెరాలు మొబైల్ యాప్‌ల ద్వారా పాకిస్థాన్‌లో ఉన్న హ్యాండ్లర్లకు లైవ్ వీడియో పంపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఫేక్ ఐడీలతో సిమ్ కార్డులు తీసుకుని ఈ వ్యవస్థను నిర్వహించినట్లు తెలిసింది. ఈ ముఠా పంజాబ్‌లోని జలంధర్, పఠాన్‌కోట్, కపూర్తల, పాటియాలా, మోగా, హరియాణాలో అంబాలా, జమ్ముకశ్మీర్‌లో కథువా, రాజస్థాన్‌లో బికానేర్, అల్వార్ వంటి ప్రాంతాల్లో కెమెరాలు అమర్చినట్లు గుర్తించారు. ఈ ప్రాంతాల్లో సైనిక దళాల రాకపోకలు ఎక్కువగా ఉండటం, అంతర్జాతీయ సరిహద్దులకు సమీపంగా ఉండటం వల్లే ముఠా వాటిని లక్ష్యంగా





ఎంచుకున్నట్లు తెలుస్తోంది.

**రెండు ఆపరేషన్స్**

పోలీసులు ఈ ఉగ్రముఠాను రెండు ఆపరేషన్స్‌లో ఛేధించారు. స్పెషల్‌సెల్ నార్త్ రేంజ్ బృందాల నేతృత్వంలో జరిగిన మొదటి ఆపరేషన్‌లో పంజాబ్, ఢిల్లీకి చెందిన ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. వీరివద్ద నుంచి 9 సీసీ కెమెరాలు, 4 తుపాకులు, 24 కార్ట్రిడ్జ్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఇంటెలిజెన్స్ సమాచారం మేరకు సౌత్ వెస్ట్ రేంజ్ నిర్వహించిన రెండో ఆపరేషన్‌లో పంజాబ్‌లో మరో ఐదుగురిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పోలీసుల విచారణలో నిందితులు కీలక విషయాలను వెల్లడించారు. ఆయుధాలు, మాదకద్రవ్యాల స్మగ్లింగ్ ద్వారా వచ్చే డబ్బుతో తమను ఈ నెట్‌వర్క్‌లోకి ఆకర్షింపజేశారని నిందితులు పోలీసుల విచారణలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, పంజాబ్‌లోని తార్న్ తారన్‌కు చెందిన మన్‌ప్రీత్ సింగ్ అనే వ్యక్తి ఈ ముఠాలో ప్రధాన నిందితుడిగా పోలీసులు గుర్తించారు. మన్‌ప్రీత్ పాక్ హ్యాండ్లర్లతో నేరుగా సంబంధాలు కొనసాగిస్తూ ఆయుధాల సరఫరా, కమ్యూనికేషన్ వ్యవస్థను సమన్వయం చేయడంలో ఇతను కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు.

**కీలక ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి పాక్?కు చేరవేత**

దీర్ఘకాలిక గూఢచార కార్యకలాపాలను కొనసాగించడానికి స్థానిక యువతను నియమించుకోవడం, వారితో తమ నెట్‌వర్క్‌ను విస్తరించడం వంటి బాధ్యతలను కూడా ఈ మాడ్యూల్‌కు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల్లో కొందరు ఆర్మీ కంటోన్మెంట్ల వద్ద రెక్కీ నిర్వహించడం, సరిహద్దు అవతల ఉన్న హ్యాండ్లర్లతో ఫొటోలు, వీడియోలను పంచుకోవడంలో ఈ ముఠా ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో అన్మోల్ అనే నిందితుడు తన సహచరుడు సాహిల్, పలు ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసే బాధ్యత తీసుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడి అయ్యింది. వీటితో పాటు పోలీసుల దర్యాప్తులో మరికొన్ని కీలక విషయాలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఈ మాడ్యూల్ భద్రతా స్థావరాలపై గ్రెనేడ్లతో దాడులు చేయాలని కూడా ప్రణాళికలు రచించినట్లు సమాచారం. అయితే, ఈ అరెస్టులతో పెద్ద ఉగ్రదాడిని ముందుగానే అడ్డుకున్నామని అధికారులు తెలిపారు. కాగా, సీసీటీవీ డేటా, మొబైల్ ఫోన్లలోని సమాచారాన్ని విశ్లేషిస్తూ మరిన్ని లింకులు వెలికితీయడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు.

# గృహ గణనలో ఇప్పటికే 5.72 లక్షల కుటుంబాల సెల్ఫ్ ఎన్యుమరేషన్

2027 జనగణన తొలి విడతలో భాగంగా నిర్వహిస్తున్న గృహ గణన(హూ)లో ఇప్పటివరకు 5.72 లక్షలకు పైగా కుటుంబాలు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) సౌకర్యాన్ని వినియోగించుకున్నాయి. ఈ విషయాన్ని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జీఐ) మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ వెల్లడించారు. ఈ అంశం జనగణనతో ముడిపడిన డిజిటల్ సదుపాయాల్లో పెరుగుతున్న ప్రజా భాగస్వామ్యాన్ని అద్దం పడుతోందని ఆయన తెలిపారు. లక్షలాది కుటుంబాలు ఆన్‌లైన్‌లోనే గృహ గణన సమాచారాన్ని సమర్పించడం ద్వారా దేశ నిర్మాణం కోసం వేగవంతమైన, స్మార్ట్‌గా, సౌకర్యవంతంగా ఉండే మార్గాన్ని ఎంచుకున్నారని చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ఆర్‌జీఐ ఒక ట్వీట్ చేశారు.

**స్వీయ గణన - ఐడీ జనరేషన్ - వెరిఫికేషన్**

దేశంలో తొలి విడత గృహ గణన ప్రక్రియ ఏప్రిల్ 1న 5 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రారంభమైంది. ఈ జాబితాలో గోవా, కర్ణాటక, మిజోరాం, ఒడిశా, సిక్కిం, అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, ఢిల్లీ (న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ - చీణవీజ ప్రాంతం, ఢిల్లీ కంటోన్మెంట్ బోర్డు పరిధి మాత్రమే) ఉన్నాయి. ఈ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని కుటుంబాలు ఏప్రిల్ 1 నుంచి 15 వరకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు. కుటుంబాలకు స్వీయ గణన చేసుకునే అవకాశాన్ని ఇవ్వడం ఇదే తొలిసారి. ఇందుకోసం ప్రత్యేక పోర్టల్‌ను (https://se.census.gov.in/) రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా అందుబాటులోకి తెచ్చింది. దీనిలో అడిగే ప్రశ్నలకు ప్రజలు స్వయంగా సమాధానాలను నమోదు చేయెచ్చు. అన్ని ప్రశ్నలకు సమాధానాలను ఇచ్చాక, ఎస్ఈ ఐడీ (Self-Enumeration ID) జనరేట్ అవుతుంది. తదుపరిగా ఏప్రిల్ 16 నుంచి మే 15 వరకు జరగనున్న డోర్ టు డోర్ గృహ గణన సందర్భంగా వెరిఫికేషన్ కోసం తమ ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లకు ఎస్ఈ ఐడీని ప్రజలు అందిస్తారు.





**ప్రత్యేక మొబైల్ యాప్ - ప్రతీ కుటుంబానికి 33 ప్రశ్నలు**

మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరుగుతున్న 8వ జనగణన ఇది. దీన్ని రెండు దశల్లో నిర్వహించనున్నారు. తొలి దశలో ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు విడతలవారీగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో(యూటీలు) గృహ గణన జరుగుతుంది. రాష్ట్రాలు, యూటీలు తమ సౌలభ్యాన్ని బట్టి గరిష్ఠంగా 30 రోజులు కూడా ఈ ప్రక్రియను నిర్వహించుకోవచ్చు. తొలుత అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 15 రోజుల పాటు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) కోసం ప్రజలకు అవకాశం ఇస్తారు. ఆ గడువు ముగిసిన మరుసటి రోజు నుంచే ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి వెరిఫికేషన్ మొదలుపెడతారు. ప్రతీ ఇంటికి చెందిన కుటుంబాన్ని 33 ప్రశ్నలు అడిగి సమాధానాలను నమోదు చేస్తారు. కుటుంబ పెద్ద సమాచారం, పేరు, లింగం, ఇంటి యాజమాన్యం వివరాలు, ఇంట్లోని కనీస వసతులపైనే ఈ ప్రశ్నలన్నీ ఉంటాయి. ఈ సమాచారం నమోదు కోసం ఎన్యుమరేటర్లు ప్రత్యేక మొబైల్ యాప్‌ను వినియోగిస్తారు. మొత్తం మీద ఈ ప్రక్రియ పూర్తిగా డిజిటల్‌గా జరుగుతుంది. ఇక జనగణన రెండో దశ 2027 ఫిబ్రవరిలో మొదలవుతుంది. అయితే మంచుతో కూడిన లద్దాఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి చోట్ల 2026 సెప్టెంబరులోనే జనగణన రెండో దశ ప్రక్రియను నిర్వహిస్తారు.

**తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎప్పుడు?**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సెల్ఫ్ ఎన్యుమరేషన్ వేర్వేరు తేదీల్లో జరగనుంది. ఆంధ్రప్రదేశ్‌లో సెల్ఫ్ ఎన్యుమరేషన్ కాలపరిమితి ఏప్రిల్ 16 నుంచి ఏప్రిల్ 30 వరకు ఉంటుంది. ఇంటింటి సర్వే మే 1 నుంచి మే 30 వరకు జరుగుతుంది. తెలంగాణలో సెల్ఫ్ ఎన్యుమరేషన్ కాలపరిమితి ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు ఉంటుంది. ఇంటింటి సర్వే మే 11 నుంచి జూన్ 9 వరకు జరుగుతుంది. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసేటప్పుడు ఎలాంటి డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదు.

## మహిళలకు, నిరుద్యోగులకు రూ.3000 ఆర్థిక సాయం

బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బీజేపీ శుక్రవారం విడుదల చేసిన తన మేనిఫెస్టోలో వరాల జల్లు కురిపించింది. బీజేపీ కనుక అధికారంలోకి వస్తే చొరబాటుదారులపై కఠిన వైఖరి అవలంబిస్తామని స్పష్టం చేసింది. బంగాల్?లోని ప్రతి మహిళకు, నిరుద్యోగ యువతకు నెలకు రూ.3000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన 45 రోజుల్లోనే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఏడో వేతన సంఘం ఏర్పాటు చేస్తామని పేర్కొంది. బంగాల్ ఎన్నికల కోసం బీజేపీ శుక్రవారం సంకల్ప పత్రం (మేనిఫెస్టో) విడుదల చేసింది. ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ సంకల్ప పత్రం రైతులు, మహిళలు, యువతకు మార్గనిర్దేశం చేస్తుందని అన్నారు. బంగాల్ సంస్కృతిని చూసి గర్వపడే ప్రతి పౌరుడికి ఇది సరికొత్త ఆశలు కల్పిస్తుందన్నారు. ఈ పత్రం 'సోనార్ బంగ్లా' (బంగారు బంగాల్) సృష్టికి ఒక రోడ్ మ్యాప్ అని పేర్కొన్నారు.

**మహిళలను ఆకట్టుకునేందుకు!**

మహిళా ఓటర్లను ఆకట్టుకులనేందుకు, రాష్ట్రంలోని మహిళలకు నెలకు రూ.3వేలు చొప్పున నగదు బదిలీ చేస్తామని తమ బీజేపీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. అలాగే పోలీస్ ఫోర్స్‌తో సహా అన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని పేర్కొన్నారు.

**మమతపై విమర్శల జల్లు**

మరోవైపు అధికారంలో ఉన్న మమత బెనర్జీ ప్రభుత్వంపై అమిత్? షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత 15 ఏళ్ల తృణమూల్? కాంగ్రెస్? పాలన ప్రజలకు ఒక పీడకలగా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆరోపించారు. "ప్రజలు ఎంతో ఆశతో మమతా దీదీకి అధికారం ఇచ్చారు. కానీ ఈ రోజు వారే మార్పు కోరుకుంటున్నారు" అని అన్నారు.

## రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన నీతీశ్ కుమార్

బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంటు భవనంలో రాజ్యసభ ఛైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. నీతీశ్ హిందీలో ప్రమాణం చేయగా ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రులు జేపీ నడ్డా, నిర్మలా సీతారామన్, అర్జున్ రామ్ మేఘవాల్‌తో పాటు జేడీయూ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ కుమార్ ఝా, కాంగ్రెస్ నేత జైరాం రమేష్ సహా తదితరులు హాజరయ్యారు. నీతీష్ కుమార్ రాజ్యసభకు ఎన్నుకోవడంతో బిహార్‌లో దాదాపు రెండు దశాబ్దాల పాటు సాగిన ఆయన ప్రస్థానం ముగిసినట్లే అని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 14న చీ.ఙ.ూా కూటమి బిహార్‌కు కొత్త సీఎంను ఎన్నుకోనుంది. ఈ మేరకు ప్రస్తుతం ఉపముఖ్యమంత్రిగా ఉన్న సామ్రాట్ చౌదరిని సీఎం పదవి వరించే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది.

## ఇంధన భద్రతపై గల్ఫ్ దేశాలతో చర్చలు

ఇంటర్నెట్ డెస్క్: లెబనాన్‌లో ఇజ్రాయెల్ కొనసాగిస్తోన్న దాడులపై భారత విదేశాంగ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడుల్లో అనేక మంది ప్రజలు ప్రాణాలు కల్పోవడం బాధాకరమన్నారు.



పశ్చిమాసియాలోని పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని.. లెబనాన్‌లోని భారత పౌరుల భద్రతపై ఎప్పటికప్పుడు అక్కడి భారత రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. దేశ ఇంధన భద్రతను బలోపేతం చేసేందుకు కేంద్ర మంత్రులు గల్ఫ్ దేశాల్లో పర్యటిస్తున్నారని రణ్‌ధీర్ జయస్వాల్ వెల్లడించారు. ఈ మేరకు ఖతార్‌తో ఒప్పందం చేసుకొనేందుకు చర్చలు కొనసాగుతున్నాయన్నారు. అదే సమయంలో పొరుగు దేశాల ఇంధన అవసరాలనూ తీర్చడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రెండు వారాల క్రితం భారత్.. శ్రీలంకకు 38 మెట్రిక్ టన్నుల పెట్రోలియం ఉత్పత్తులను సరఫరా చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుత ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయ సముద్ర జలాల్లో చిక్కుకుపోయిన భారత నావికులను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేశంలో ఎల్‌పీజీ, పెట్రోల్ ఇతర ఇంధన నిల్వలకు ఎటువంటి కొరతా లేదని పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ పేర్కొన్నారు. పెట్రోల్ బంకులలో తగినంత నిల్వలు ఉన్నాయని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా సాధారణంగానే ఉందన్నారు.

## శాంతి చర్చలవేళ పాకిస్థాన్‌లో హైఅలర్ట్.. ఇస్లామాబాద్‌లో రెడ్ జోన్‌కు మూత..!





అమెరికా-ఇరాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినా.. పశ్చిమాసియా లో ఉద్రిక్తతలు మాత్రం ముగిసిపోలేదు. కాల్పులు విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత కూడా ఇజ్రాయెల్ లెబనాన్‌పై దాడులు చేయడం, అందుకు ప్రతిగా ఇరాన్ హర్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేయడం లాంటి పరిణామాలు ఉద్రిక్తతలను పెంచాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు శాంతి చర్చలకు పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తోంది. ఏప్రిల్ 11న రాజధాని ఇస్లామాబాద్‌లో చర్చలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ హై అలర్ట్‌లోకి వెళ్లిపోయింది. ప్రభుత్వ భవనాలు, కీలక రహదారి మార్గాల వద్ద భద్రతా బలగాలు పహారా కాస్తున్నాయి. రాజధానిలోని రెడ్‌జోన్ చుట్టూ కట్టుదిట్టమైన భద్రత కొనసాగుతోంది. అక్కడ పరిమిత సంఖ్యలోనే జనసంచారం కనిపిస్తోంది. అంటే ఒక రకంగా రెడ్‌జోన్‌ను పూర్తిగా సీల్ చేశారు. అంటే మూతవేశారు. ఇస్లామాబాద్‌లో ఉన్న పార్లమెంట్, కీలక ప్రభుత్వ కార్యాలయాలు, లగ్జరీ హోటళ్లు, ఎంబసీలు, విదేశీ సంస్థల కార్యాలయాలు ఉన్న ప్రాంతాన్ని రెడ్‌జోన్‌గా పిలుస్తారు. శాంతి చర్చల నేపథ్యంలో ఇప్పుడు ఇస్లామాబాద్‌లో సెలవు ప్రకటించారు. దుకాణ సముదాయాలు కూడా మూతపడ్డాయి. తమ మధ్యవర్తిత్వంతోనే అమెరికా-ఇరాన్ దేశాల మధ్య రెండు వారాలపాటు కాల్పుల విరమణ ఒప్పందం జరిగిందని పాకిస్థాన్ చెప్పింది. ఇప్పుడు ఆ రెండు దేశాల మధ్య శాంతి చర్చలకు ఆతిథ్యం ఇస్తోంది. ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ నేతృత్వంలోని బృందం అమెరికా తరఫున చర్చల్లో పాల్గొననున్నట్లు తెలుస్తున్నది. ఇక ఇరాన్ వైపు నుంచి విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ, పార్లమెంట్ స్పీకర్ ఘాలిబాఫ్ పాకిస్థాన్ బయలుదేరారంటూ అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. అయితే ఈ వార్తలను ఇరాన్ ఖండించింది. ఆ ఇద్దరూ తమ రాజధాని టెహ్రాన్‌లోనే ఉన్నారని తెలిపింది.

# సీఎంతో బీసీ సంఘాల భేటీ

అమరావతి,రక్షణ న్యూస్

బీసీల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని ముఖ్యమంత్రి  చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. బీసీల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని పేర్కొన్నారు.

శుక్రవారం సచివాలయంలో ఏపీ బీసీ సంక్షేమ సంఘం నేతలు ముఖ్యమంత్రిని కలిశారు. రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, జాతీయ అధ్యక్షుడు జే. శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో వచ్చిన ప్రతినిధి బృందం సీఎంకు పలు డిమాండ్లతో కూడిన విజ్ఞాపన పత్రాన్ని అందజేసింది.

బీసీలకు జనాభా దామాషా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని ముఖ్యమంత్రిని కోరారు. అలాగే బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని త్వరితగతిన తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, కేంద్రంతో మాట్లాడి ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు.

అదే విధంగా ఓబీసీ సబ్ ప్లాన్ రూపొందించి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖలలో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని బీసీ సంఘం నేతలు తమ వినతి పత్రంలో పేర్కొన్నారు.



వినతి పత్రాన్ని స్వీకరించిన ముఖ్యమంత్రి కేంద్ర పరిధిలో ఉన్న అంశాలను కేంద్ర ప్రభుత్వంతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. బీసీలకు పూర్తి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా బీసీ నేతలు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని పేర్కొన్నారు. చేనేతలకు ఉచిత విద్యుత్, మత్స్యకారులకు వేట నిషేధ భృతి, 217 జీవో రద్దు, కల్లు గీత కార్మికులకు 10 శాతం రిజర్వేషన్లు, వడ్డెరలకు మైనింగ్‌లో రిజర్వేషన్లు కల్పించడం వంటి నిర్ణయాలు కూటమి ప్రభుత్వ ఘనతగా తెలిపారు.

# సైడ్ పార్టీని పట్టుకున్న కవిత వ్యూహం ఏంటి?

**హైదరాబాద్ :** రాజకీయం అంటేనే ఎత్తుగడలు.. మరీ ముఖ్యంగా సొంత గూడు వదిలి బయటకు వచ్చిన నేతలు వేసే అడుగులు చదరంగంలో ఎత్తుల కంటే వేగంగా మారుతుంటాయి. ఈ నెలలోనే ఎజెండాను ప్రకటిస్తానని చెబుతున్న మాజీ ఎంపీ కవిత ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నారు. సహజంగా కొత్త పార్టీ పెడితే అధికార పక్షాన్ని టార్గెట్ చేయడం ఆనవాయితీ.. కానీ, కవిత మాత్రం దీనికి భిన్నంగా వెళ్తున్నారు. అధికార కాంగ్రెస్‌ను కాదని, బలహీనపడ్డ 'కారు' (బీఆర్ఎస్) వెంటే ఆమె ఎందుకు పడుతున్నారు..? ఈ వ్యూహం వెనుక ఉన్న అసలు లెక్కలేంటో చూద్దాం. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి తిరుగు లేదన్న వాదన బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక ఐకాన్ లీడర్‌గా ఎదిగారు. ఆయన ఇమేజ్ మరోసారి పార్టీని అధికారంలోకి తెస్తుందన్న విశ్వాసం ప్రజల్లో ఉంది. ఇలాంటి సమయంలో బలంగా ఉన్న రేవంత్ రెడ్డిని కదిపితే అనవసరమైన ఇబ్బందులు తప్ప ప్రయోజనం ఉండదని కవిత భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే రేవంత్ రెడ్డి జోలికి వెళ్లకుండా, తన రాజకీయ భవిష్యత్తు కోసం మరో మార్గాన్ని ఎంచుకున్నారు. అదే కారు పార్టీని కంగారు పెట్టడం. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎన్నో ప్రాజెక్టులు, పథకాలు ప్రవేశపెట్టినప్పటికీ.. కుటుంబ పాలన, అవినీతి ఆరోపణలు ఆ పార్టీని దెబ్బతీశాయి. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర పరాజయాన్ని మూట గట్టుకుంది. ఇప్పుడు బీఆర్ఎస్‌లో నాయకత్వ లేమి, అంతర్గత కలహాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం కావడం, కేటీఆర్-హరీష్ రావు మధ్య విభేదాల వాదనలు వినిపిస్తుండడంతో ఆ పార్టీ క్యాడర్ అయోమయంలో ఉంది. ఈ అనిశ్చిత వాతావరణమే తనకు అనుకూలమని కవిత అంచనా వేస్తున్నారు.ఓటు బ్యాంకు బీఆర్ఎస్ పార్టీకి క్షేత్ర స్థాయిలో ఇప్పటికీ బలమైన కేడర్



ఉంది. ఆ కేడర్ ఇప్పుడు నిరుత్సాహంలో ఉండడంతో, వారిని తన వైపు తిప్పుకోవాలన్నది కవిత పక్కా ప్లాన్. బీజేపీకి నాయకులు ఉన్నా క్షేత్ర స్థాయి ఓటు బ్యాంకు తక్కువగా ఉండడంతో, ఆమె దృష్టి అంతా బీఆర్ఎస్ కేడర్‌పైనే ఉంది. 'కారు'లోని అసంతృప్త నేతలను, నాయకత్వం కోసం వెతుకుతున్న కార్యకర్తలను చేరదీయడం ద్వారా తన కొత్త పార్టీని బలోపేతం చేసుకోవాలని వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరన్నది జగమెరిగిన సత్యం. నిన్నటి వరకు అదే పార్టీలో ఉండి, ఇప్పుడు అదే పార్టీ ఓటు బ్యాంకును కొల్లగొట్టాలని చూడడం రాజకీయ చదరంగంలో ఒక భాగమే. కవిత వేస్తున్న ఈ 'రివర్స్ వ్యూహం' ఎంత వరకు ఫలమిస్తుంది..? కేసీఆర్ నిర్మించిన కోటలో ఆమె చీలిక తీసుకురాగలదా? అన్నది ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ఈ నెల 25న కవిత ప్రకటించబోయే జెండా, అజెండాలో బీఆర్ ఎస్ పార్టీకి సంబంధించి ఎలాంటి అంశాలు ఉంటాయన్నది కీలకం. కాంగ్రెస్‌ను కాదని బీఆర్ఎస్‌ను టార్గెట్ చేయడం ద్వారా ఆమె తెలంగాణ రాజకీయ చిత్రపటాన్ని మార్చాలని చూస్తున్నారు. ఒకవేళ బీఆర్ఎస్ కేడర్ ఆమె వైపు మొగ్గ చూపితే, రాష్ట్రంలో విపక్ష హోదా కోసం సరికొత్త పోరాటం మొదలవుతుంది. ఏదేమైనా కవిత వేస్తున్న ఈ ఎత్తుగడలు గులాబీ శ్రేణుల్లో మాత్రం గుబులు పుట్టిస్తున్నాయి.

# 2028 నాటికి జిల్లాల పునరవ్యవస్థీకరణ

**హైదరాబాద్ :** రాష్ట్రంలో పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడమా లేక రాజకీయంగా పట్టు సాధించడమా? కారణం ఏదైనా తెలంగాణలో జిల్లాల సరిహద్దుల మార్పు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. గత ప్రభుత్వం (బీఆర్ఎస్) చేసిన జిల్లాల విభజనలో లోపాలున్నాయని, శాస్త్రీయత లేదని భావించిన కాంగ్రెస్ సర్కార్, ఇప్పుడు సర్జరీకి సిద్ధమైంది. ఈ మార్పులు కేవలం భౌగోళిక సరిహద్దులకే పరిమితమా? లేక కొత్త జిల్లాల ఏర్పాటుకు దారితీస్తాయా? అన్నది ఆసక్తికరంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విభజనలో కొన్ని ప్రాంతాలను తమ రాజకీయ ప్రయోజనాల కోసం కలిపారని, దీనివల్ల ప్రజలకు దూరాభారం పెరిగిందని ప్రస్తుత ప్రభుత్వం భావిస్తోంది. రేవంత్ రెడ్డి వ్యూహం ప్రకారం.. కేవలం జిల్లాల సంఖ్యను పెంచడం కాకుండా, భౌగోళికంగా, పరిపాలనా పరంగా ప్రజలకు దగ్గరగా ఉండేలా సరిహద్దులను సవరించడమే ప్రధాన లక్ష్యం. ఇప్పటికే ఐఏఎస్ అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకున్న ప్రభుత్వం, ఏ ఏ జిల్లాలను విడగొట్టాలి లేదా ఏ ప్రాంతాలను పక్క జిల్లాల్లో కలపాలి అనే అంశంపై ప్రాథమిక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది.ప్రస్తుతం దేశవ్యాప్తంగా జనగణన ప్రక్రియ ప్రారంభం కావడంతో, నిబంధనల ప్రకారం.. జిల్లాల సరిహద్దులను మార్చడానికి వీలులేదు. ఈ ప్రక్రియ 2028 చివరి నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం తన పదవీకాలం ముగిసేలోగా ఈ భారీ ఆపరేషన్ పూర్తి చేయాలని చూస్తోంది. దీనివల్ల రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి కొత్త జిల్లాల సెంటిమెంట్, ప్రజల ఆకాంక్షలను తమకు అనుకూలంగా మార్చుకోవచ్చనేది రాజకీయ వ్యూహం.కేవలం జిల్లాల సరిహద్దుల మార్పు మాత్రమే కాకుండా, భవిష్యత్తులో జరగబోయే అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనను కూడా దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ అడుగులు వేస్తున్నట్లు సమాచారం. జిల్లా కేంద్రానికి, నియోజకవర్గ కేంద్రానికి మధ్య ఉన్న దూరాన్ని తగ్గించడం ద్వారా అభివృద్ధి ఫలాలు క్షేత్ర స్థాయికి వేగంగా చేరుతాయని ప్రభుత్వం వాదిస్తోంది. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాల సెంటిమెంట్‌ను గౌరవిస్తూనే, పరిపాలనలో వస్తున్న ఇబ్బందులను తొలగించడం ద్వారా ఓటర్లను ఆకట్టుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. జిల్లాల పునర్విభజన అనేది ఎప్పుడూ ఒక డబుల్ ఎడ్జ్ స్వార్డ్ (రెండంచుల కత్తి) లాంటిదే. ఒక ప్రాంతాన్ని




జిల్లాగా ప్రకటించినప్పుడు వచ్చే మైలేజీ కంటే, కీలకమైన ప్రాంతాలను పక్క జిల్లాల్లో కలిపినప్పుడు వచ్చే వ్యతిరేకత ఎక్కువగా ఉంటుంది. అందుకే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈసారి అనాలోచితంగా కాకుండా, ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టి, అఖిలపక్ష సమావేశాల ద్వారా ఏకాభిప్రాయం సాధించాలని చూస్తోంది. ఏది ఏమైనా, 2028 నాటికి తెలంగాణ రాజకీయ చిత్రపటం మరోసారి మారడం ఖాయంగా కనిపిస్తోంది.

## క్యాబినెట్ లీకులపై మంత్రులకు సీఎం క్లాస్

అమరావతి: రక్షణ న్యూస్

క్యాబినెట్ సమావేశాల్లో చర్చించే అంశాలు ముందుగానే బయటకు రావడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రివర్గ సమావేశంలో ఈ విషయంపై మంత్రులకు సీఎం క్లాస్ తీసుకున్నట్లు సమాచారం. క్యాబినెట్‌లో చర్చించే విషయాలు ముందుగానే బయటకు రావడం సరైన పద్ధతి కాదని, ఇది ప్రభుత్వ వ్యవస్థకు నష్టం కలిగించే అంశమని సీఎం స్పష్టం చేశారు. గతంలో నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా క్యాబినెట్ విషయాలు లీక్ కావడంతో 30 మంది మంత్రులను ఒకేసారి తొలగించిన ఘటనను ఆయన గుర్తు చేశారు. ఇక నుంచి క్యాబినెట్‌కు సంబంధించిన విషయాలను ఒక రోజు ముందుగానే నిర్ణయిస్తామని, గోప్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని సీఎం హెచ్చరించారు. క్యాబినెట్ వ్యవహారాల్లో మంత్రులతో పాటు అధికారులు, ముఖ్యంగా కార్యదర్శులు కూడా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. రాజకీయాల్లో క్రిమినల్ అంశాలను ఉపయోగించి ఆరోపణలు చేయడం సరైన విధానం కాదని, ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ను ఉద్దేశిస్తూ సీఎం వ్యాఖ్యానించినట్లు తెలిసింది. అదేవిధంగా రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు వచ్చే మూడు నెలల్లో నిర్వహించే అవకాశం ఉందని సీఎం సూచించారు. దీనికి అనుగుణంగా ఎమ్మెల్యేలు, మంత్రులు ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలని, స్థానిక స్థాయిలో పార్టీ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరేలా పని చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేయాలని సీఎం మంత్రులకు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం.

## స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

అమరావతి:రక్షణ న్యూస్

రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మంత్రి నారా లోకేశ్ పార్టీ మంత్రులతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల కోసం ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి విస్తృతంగా తెలియజేయాలని మంత్రులకు సూచించారు. ప్రభుత్వ పనితీరు ప్రజలకు చేరేలా పనిచేయడం ద్వారా పార్టీ బలపడుతుందని ఆయన తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలతో సమన్వయం పెంచుకోవాలని, స్థానిక స్థాయిలో సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలు, వార్డుల స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాలని ఆయన అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీకి ఎంతో కీలకమని, అందుకు అనుగుణంగా ప్రతి మంత్రి తన బాధ్యతను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు. ప్రజలతో నిత్యం మమేకమై వారి సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ఫలితాలు ప్రజలకు చేరేలా ప్రతి నాయకుడు కృషి చేయాలని లోకేశ్ సూచించారు. పార్టీ శ్రేణులు ఎన్నికలకు సిద్ధంగా ఉండేలా ముందస్తు వ్యూహంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## న్యాయశాఖ పటిష్టతకు చర్యలు

-మొదటిపేజీ తరువాయి

తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే విధానపరమైన జాప్యాలను తొలగించేందుకు పలు మార్గాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాలను ప్రోత్సహించడం, లోక్ అదాలత్‌లను మరింత బలోపేతం చేయడం వంటి అంశాలపై కూడా సమావేశంలో చర్చించారని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో అమల్లో ఉన్న లిటిగేషన్ పాలసీలను పరిశీలించి వాటిలో ఉన్న మంచి పద్ధతులను రాష్ట్రంలో అమలు చేయాలని మంత్రులు సూచించారు. ఈ సమావేశంలో న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభా దేవి మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పీఎన్జీ వినియోగం పెంచాలి

అమరావతి, రక్షణ న్యూస్

అంతర్జాతీయ పరిస్థితులు, యుద్ధాల కారణంగా తలెత్తే ఎల్పీజీ గ్యాస్ సరఫరా సమస్యలను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి  చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) వినియోగాన్ని పెంచడం ద్వారా గ్యాస్ సరఫరా సమస్యలను తగ్గించవచ్చని ఆయన పేర్కొన్నారు. సచివాలయంలో గ్యాస్ సరఫరా పరిస్థితిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం మాట్లాడారు. దీపం పథకం లబ్ధిదారులకు పీఎన్జీ వినియోగంపై అవగాహన కల్పించాలని ఆయన అధికారులకు ఆదేశించారు. దీపం పథకం లబ్ధిదారులు పీఎన్జీకి మారితే వారికి అందే రాయితీ సొమ్మును అదే విధంగా జమ చేయాలని ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. దీనికి సంబంధించి వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. పీఎన్జీ కనెక్షన్ తీసుకున్నా దీపం పథకం ద్వారా లభించే ప్రయోజనాలు కొనసాగుతాయని లబ్ధిదారులకు స్పష్టంగా తెలియజేయాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో పీఎన్జీ వినియోగాన్ని విస్తరించేందుకు ఆయిల్ కంపెనీలు వేగంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వచ్చే ఆరు నెలల్లో మొత్తం 10 లక్షల పీఎన్జీ కనెక్షన్లు ఇవ్వాలని సీఎం లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ విషయంలో ఎటువంటి జాప్యం లేకుండా టార్గెట్ సాధించాలని ఆయిల్ కంపెనీలను ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గృహ అవసరాలకు సంబంధించిన గ్యాస్ సరఫరాలో ఉన్న సమస్యలను అధిగమించామని తెలిపారు. డొమెస్టిక్ గ్యాస్ పంపిణీలో ఏర్పడిన ఇబ్బందులను తగ్గించామని, త్వరలో సాధారణ పరిస్థితి నెలకొంటుందని వివరించారు. ఇదే సమయంలో శ్రీకాకుళం--కాకినాడ నేచురల్ గ్యాస్ పైప్‌లైన్ పనుల పురోగతిపై సీఎం వివరణ కోరారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని అధికారులు తెలిపారు. దీంతో సమీక్ష సమావేశం నుంచే కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హారదీప్ సింగ్ పూరి కు ముఖ్యమంత్రి ఫోన్ చేసి పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, పైప్‌లైన్ పనులను వేగంగా పూర్తి చేయాలని సీఎం కోరగా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలోనే సమీక్షించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## రాయలసీమ ప్రాజెక్ట్‌పై వైసీపీ రాజకీయాలు

**అమరావతి, రక్షణ న్యూస్ :** రాయలసీమ ప్రాజెక్ట్ అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవాలని వైసీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నుల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. ఏపీ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమపై ప్రేమ ఉన్నట్టు చూపిస్తూ వైసీపీ నాయకులు మరోసారి రాజకీయాలు చేయాలని చూస్తున్నారని మంత్రి వ్యాఖ్యానించారు. ఎన్జీటీ ఆదేశాలతో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ వైసీపీ ప్రభుత్వ కాలంలోనే ఆగిపోయిందని ఆయన పేర్కొన్నారు. అలాంటి పరిస్థితిలో ఆగిపోయిన ప్రాజెక్ట్‌ను ప్రస్తుత ప్రభుత్వం ఎలా ఆపగలదని ప్రశ్నించారు. గత ప్రభుత్వం పాలనలో రాయలసీమలో భూసంబంధిత సమస్యలు, నీటి సమస్యలపై సరైన చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు. కాల్వలలో మట్టిని తొలగించడం వంటి కనీస పనులు కూడా చేయలేదని విమర్శించారు. అన్నమయ్య డ్యాం ఘటన తర్వాత కూడా సరైన చర్యలు తీసుకోలేదని అన్నారు. రాయలసీమ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. రూ.40 వేల కోట్లతో రాయలసీమలో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు. అలాగే హంద్రీనీవా ప్రాజెక్ట్‌కు ఒక్క ఏడాదిలోనే రూ.3,700 కోట్ల నిధులు కేటాయించి పనులు పూర్తి చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. అదనంగా మరో రూ.2 వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. రాయలసీమ అభివృద్ధికి గత ప్రభుత్వం ఎంత ఖర్చు పెట్టిందో చర్చకు రావాలని మాజీ ముఖ్యమంత్రి  జగన్ మోహన్ రెడ్డి ను మంత్రి సవాల్ చేశారు. రాయలసీమ పేరు చెప్పడానికి కూడా గత ప్రభుత్వం ఐదేళ్లలో సాహసించలేదని విమర్శించారు. ప్రక్క రాష్ట్రం లోని తుంగభద్ర డ్యాం గేట్లు కొట్టుకుపోయిన ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించిందని మంత్రి తెలిపారు. దేశంలోని నిపుణులను తీసుకువచ్చి పంటలకు నష్టం కలగకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఇప్పటికే 33 గేట్లలో 18 గేట్లను మూడు నెలల్లోనే బిగించామని, వర్షాలు వచ్చేలోపు మిగిలిన గేట్లను కూడా పూర్తిగా బిగిస్తామని వెల్లడించారు. రాయలసీమ అభివృద్ధి పేరుతో ప్రజలను మళ్లీ మోసం చేయడానికి వైసీపీ ప్రయత్నిస్తోందని మంత్రి విమర్శించారు.  రాయలసీమ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

రక్షణ
శుక్రవారం 10
ఏప్రిల్ 2026



# చరిత్రను తిరగరాసిన రణ్‌వీర్ సింగ్..

**రూ.1000 కోట్ల క్లబ్‌లో చేరిన మొదటి బాలీవుడ్ సినిమాగా 'ధురంధర్ 2'**

బాలీవుడ్ చిత్ర పరిశ్రమలో సరికొత్త చరిత్ర ఆవిష్కృతమైంది. స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా, దర్శకుడు ఆదిత్య ధర్ రూపొందించిన భారీ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేటను కొనసాగిస్తూ సరికొత్త మైలురాయిని అధిగమించింది. గతంలో 'బాహుబలి 2', 'పుష్ప 2' వంటి చిత్రాలు అన్ని భాషల్లో కలిపి భారీ వసూళ్లు సాధించినప్పటికీ, కేవలం హిందీ వెర్షన్‌లోనే రూ.1000 కోట్ల నెట్ వసూళ్లను సాధించిన మొదటి భారతీయ చిత్రంగా 'ధురంధర్ 2' రికార్డు సృష్టించింది. ఈ ఘనత సాధించిన తొలి బాలీవుడ్ చిత్రంగా ఇది చరిత్రలో నిలిచిపోనుంది. ఈ సినిమా విడుదలైన నాటి నుంచే థియేటర్ల వద్ద కాసుల వర్షం కురిపిస్తున్న సంగతి తెలిసిందే. ట్రేడ్ అనలిస్టుల అంచనాలను తలకిందులు చేస్తూ, కేవలం 21 రోజుల్లోనే రూ.1041 కోట్ల నికర వసూళ్లను రాబట్టింది. ఇక ప్రపంచవ్యాప్తంగా గ్రాస్ వసూళ్ల విషయానికి వస్తే, ఈ చిత్రం ఇప్పటికే రూ.1665 కోట్ల మార్కును దాటి తన జైత్రయాత్రను కొనసాగిస్తోంది. 2025లో బ్లాక్‌బస్టర్ హిట్ సాధించిన 'ధురంధర్'కు సీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రం, కథా బలంతో పాటు అబ్బురపరిచే యాక్షన్ సీక్వెన్స్‌లతో ప్రేక్షకులను కట్టిపడేసింది. రణ్‌వీర్ సింగ్ తన కెరీర్ బెస్ట్ పెర్ఫార్మెన్స్‌కు తోడు, సంజయ్ దత్, ఆర్. మాధవన్, అర్జున్ రాంపాల్ వంటి దిగ్గజ నటుల కలయిక సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సారా అర్జున్, రాకేష్ బేడీ తమ నటనతో సినిమాకు వెన్నుముకగా నిలిచారు.



# మనకు దక్కాల్సినవి సరైన సమయం వచ్చినప్పుడే దక్కుతాయి..

మలయాళ ముద్దుగుమ్మ మమితా బైజు.. ప్రజెంట్ బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా ఆఫర్స్ అందుకుంటూ బిజీ లైఫ్ లీడ్ చేస్తుంది. ఆమె నటిస్తున్న వరుస ప్రాజెక్టులలో 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఒకటి. కోలీవుడ్ వర్సటైల్ యాక్టర్ సూర్య, సెన్సిబుల్ డైరెక్టర్ వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో రాబోతున్న ఈ ప్రాజెక్టు సంబంధించిన షూటింగ్ ప్రజెంట్ శరవేగంగా జరుగుతున్నది. ఇందులో భాగంగానే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని సినిమాపై ఆసక్తికర కామెంట్స్ చేసింది మమిత. 'విశ్వనాథ్ అండ్ సన్స్ చిత్రంలో ఎంటర్‌టైన్మెంట్‌తో పాటు బలమైన ఎమోషనల్ కంటెంట్ కూడా ఉంటుంది. ఇది ఒక సంపూర్ణ వినోదాత్మక చిత్రంగా రూపొందగా.. ఈ చిత్రం ప్రేక్షకులకు పూర్తిస్థాయిలో ఎగ్జైట్‌మెంట్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది. నన్ను నమ్మండి.. ఈ సినిమా అద్భుతంగా ఉండబోతోంది' అని తెలిపింది. అలాగే తన సినీ ప్రయాణం గురించి మాట్లాడుతూ.. 'నేను మలయాళ చిత్రసీమలో నా ప్రయాణాన్ని ఒక సహాయ నటిగా ప్రారంభించాను. ఇప్పుడు ప్రధాన పాత్రల వైపు అడుగులు వేస్తున్నాను. ప్రతి విషయాన్ని దశలవారీగా ముందుకు తీసుకెళ్లడాన్ని నేను విశ్వసిస్తాను.. ఎందుకంటే మనకు దక్కాల్సినవి సరైన సమయానికి తప్పక మనల్ని చేరుతాయి' అంటూ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది మమిత.

## రావు బహదూర్' నుంచి ఫస్ట్ సింగిల్ అప్‌డేట్



వైవిధ్యమైన కథలు ఎంచుకుంటూ ఇండస్ట్రీలో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటుడు సత్యదేవ్ ప్రధాన పాత్రలో నటిస్తున్నలేటెస్ట్ చిత్రం 'రావు బహదూర్'. 'కేరాఫ్ కంచరపాలెం' ఫేమ్ దర్శకుడు వెంకటేష్ మహా తెరకెక్కిస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే వచ్చిన టీజర్, ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ ఫస్ట్ లుక్, టీజర్ ఆధారంగా ఇది ఒక విభిన్నమైన పీరియడ్ డ్రామా అని, సత్యదేవ్ తన కెరీర్‌లో డిఫరెంట్ రోల్ చేస్తున్నారని అర్థం అవుతుంది. ఇదిలా ఉంటే తాజాగా ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మేరకు ఓ కూల్ పోస్టర్ రిలీజ్ చేస్తూ.. 'ప్రేమకు అంకితం, ప్రేమ నుండే పుట్టిన గీతం 'ఓ సుందరి'.. 'రావు బహదూర్' నుంచి ఫస్ట్ సింగిల్ ఓ సుందరి ఏప్రిల్ 15న విడుదలవుతోంది' అని తెలిపారు. ఇక విడుదల చేసిన పోస్టర్‌లో హీరో అండ్ హీరోయిన్ లుక్ కూల్‌గా ఆకట్టుకుంటోంది. కాగా.. మహేష్ బాబు, నమ్రత సమర్పిస్తున్న ఈ చిత్రం క్షీణిస్తున్న కులీన వర్గాల నేపథ్యంతో సాగుతుంది. ఇందులో సత్యదేవ్‌తో పాటు దీప థామస్, ఆనంద్ భారతి ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. 2026 సమ్మర్ టార్గెటా ఈ చిత్రం రిలీజ్‌కు సిద్ధం అవుతుండగా.. డేట్ త్వరలో ప్రకటించనున్నారు మేకర్స్.

# రాజశేఖర్ ఫిట్‌నెస్ సీక్రెట్



టాలీవుడ్ సీనియర్ హీరో రాజశేఖర్ ఈ మధ్యే తన సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టి వరుస సినిమాలతో ప్రేక్షకులను పలకరిస్తున్నాడు. కొంత కాలం క్రితం నితిన్ హీరోగా రూపొందిన ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్ చిత్రంలో కీలకమైన పాత్రలో నటించి ప్రేక్షకులను అలరించాడు. ఈ చిత్రం బాక్స్ ఆఫీస్ దగ్గర ఫెయిల్యూర్ అయింది. తాజాగా శర్వానంద్ ప్రధాన పాత్రలో రూపొందిన బైకర్ చిత్రంలో ఈయన శర్వానంద్ కి తండ్రి పాత్రలో నటించాడు. ఈ మూవీలోని రాజశేఖర్ పాత్రకు మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. ప్రస్తుతం రాజశేఖర్ వయస్సు 64 సంవత్సరాలు, అయినా కూడా ఈ సీనియర్ నటుడు ఎంతో ఫిట్‌గా, అందంగా కనబడుతున్నాడు. దాంతో ఈయన ఎలాంటి డైట్ పాటిస్తాడు అని తెలుసుకోవాలి అనే ఉత్సాహం జనాల్లో బాగానే ఉంది. తాజాగా రాజశేఖర్ ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. అందులో ఆయన రోజు ఎలాంటి ఫుడ్ తీసుకుంటారు అనేది క్లియర్గా చెప్పుకొచ్చాడు. రాజశేఖర్ మాట్లాడుతూ... నేను రోజు తీసుకునే ఆహారం విషయంలో ఎక్కువ శాతం పండ్ల రసాలకు ప్రాముఖ్యత ఇస్తాను. రోజులో వాటిని ఎక్కువ మోతాదులో తీసుకుంటాను. కేవలం మంచి ఫుడ్ తీసుకోవడం మాత్రమే కాకుండా రోజులో కొన్ని గంటల పాటు వ్యాయామం కూడా చేస్తుంటాను. దాని ద్వారా కూడా మన శరీరం ఎంతో బాగుంటుందని, ఇలా మంచి డైట్, శరీరానికి తగిన ఎక్సర్సైజ్ రెండూ సమాన స్థాయిలో మెయింటెన్ చేయడం వల్లే తాను ఈ వయసులో కూడా అందంగా ఉన్నట్లు రాజశేఖర్ తాజాగా చెప్పుకొచ్చారు.

# రూ.10 కోట్లు పెడితే రూ.100 కోట్లు.. మలయాళంలో హిట్టు కొట్టిన తెలుగు నిర్మాత




మలయాళంలో రెండేళ్ల క్రితం సంచలన విజయం సాధించిన చిత్రాల్లో "వాళా" ఒకటి. కేవలం రూ.4 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ మూవీ ఏకంగా రూ.40 కోట్లు వసూలు చేసింది. వాళా అంటే మలయాళంలో అరటి మొక్క అని అర్థం. అలాగే పనీపాటా లేకుండా తిరిగే సోమరులని కూడా అదే పేరుతో పిలుస్తారు. వాళా చిత్రానికి 'బయోపిక్ ఆఫ్ బిలియన్ బాయ్స్' అనేది ట్యాగ్‌లైన్ ఇచ్చారు.

**మలయాళంలో హిట్ కొట్టిన తెలుగు డైరెక్టర్**

2024లో వచ్చిన ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'వాళా 2' వచ్చింది. 'బయోపిక్ ఆఫ్ బిలియన్ బ్రోస్' అనేది ఉపశీర్షిక. ఈ రెండు భాగాలకు కథ అందించింది విపిన్ దాస్ ఒక్కరే అయినా.. దర్శకులు మాత్రం మారారు. మొదటి భాగానికి ఆనంద్ మీనన్ దర్శకత్వం వహించగా రెండో భాగాన్ని సవిన్ డైరెక్ట్ చేశాడు. సీక్వెల్‌కు రూ.10 కోట్ల బడ్జెట్ కేటాయించారు. తెలుగు నిర్మాత సాహు గారపాటి ఈ సినిమా నిర్మాతల్లో ఒకరిగా ఉన్నాడు.

**సెంచరీ కొట్టిన వాళా 2**

ఏప్రిల్ 2న విడుదలైన ఈ చిత్రం ఏకంగా సెంచరీ కొట్టింది. కేవలం వారం రోజుల్లోనే రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిపోవడం విశేషం. ఈ ఏడాది మన శంకరవరప్రసాద్‌గారుతో హిట్ అందుకున్న సాహు గారపాటి.. మూడు నెలల్లో వాళా 2తో మరో బ్లాక్‌బస్టర్ అందుకున్నాడు. కాగా వాళా మొదటి భాగం హాట్‌స్టార్‌లో మలయాళంతో పాటు తెలుగులోనూ అందుబాటులో ఉంది.



# వరుణ్ తేజ్ కొరియన్ కనకరాజు నుంచి ఫస్ట్ సింగిల్ ప్రోమో!

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో వస్తున్న లేటెస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ 'కొరియన్ కనకరాజు' ఇండో-కొరియన్ నేపథ్యంలో హారర్-కామెడీ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌ను చిత్ర బృందం ఘనంగా ప్రారంభించింది. ఈ చిత్రంలోని మొదటి పాట 'కమ్సాహంనిదా' ప్రోమోను తాజాగా విడుదల చేయగా, దీనికి విశేష స్పందన లభిస్తోంది. సంగీత దర్శకుడు ఎస్. థమన్, వరుణ్ తేజ్ మరియు దర్శకుడు మేర్లపాక గాంధీ మధ్య సాగే ఫన్నీ సంభాషణలతో కూడిన ఈ ప్రోమో యూట్యూబ్‌లో ట్రెండింగ్‌గా నిలిచింది. మెలోడీ కింగ్ సిద్ శ్రీరామ్ ఆలపించిన ఈ పూర్తి పాటను ఏప్రిల్ 11న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, స్టార్ కమెడియన్ సత్య కీలకమైన వినోదాత్మక పాత్రలో అలరించనున్నారు. కొరియా సంస్కృతికి మరియు లోకల్ క్యారెక్టర్ అయిన కనకరాజుకు మధ్య ఉన్న విచిత్రమైన సంబంధాన్ని దర్శకుడు మేర్లపాక గాంధీ తన మార్కు వినోదంతో వెండితెరపై ఆవిష్కరించబోతున్నాడు. ఇప్పటికే మేజర్ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ఆఖరి షెడ్యూల్‌ను దక్షిణ కొరియాలోని అందమైన లొకేషన్లలో పూర్తి చేసుకోబోతుంది. యూవీ క్రియేషన్స్ మరియు ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై వంశీ, ప్రమోద్ మరియు విక్రమ్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. వరుస పరాజయాల తర్వాత వరుణ్ తేజ్ ఈ డిఫరెంట్ కథాంశంతో మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు. మనోజ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ సినిమాను 2026 వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

Printed and Published by G. Narendra, Editor,1-4-55, Bapatla, Bapatla District.Phone: 8185 997507...